## సిక్కింకు సమీపంలో చైనా ఫైటర్ జెట్లు

న్యూఢిల్లీ, మే 30: సిక్కింకు కేవలం 150 కిలోమీటర్ల దూరంలోనే చైనా తన అత్యంత అధునాతన జీ-20 స్టెల్త్ ఫైటర్ జెట్లను మోహరించింది. మొత్తంగా 6 ఫైటర్ జెట్లు ఉన్నట్లు ఈ నెల 27న సేకరించిన ఉపగ్రహ చిత్రాల్లో వెల్లడైంది. ప్రస్తుతం ఆ ఫైటర్ జెట్లు ఉన్న ప్రాంతం టిబెట్‌లోని షిగాట్సే విమానాశ్రయంలో ఉన్నాయి. ఈ విమానాశ్రయం సముద్ర మట్టానికి 12,408 అడుగుల ఎత్తులో ఉంటుంది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో ఉన్న విమానాశ్రయం ఇది. అయితే, దీనిపై స్పందించటానికి భారత వాయుసేన నిరాకరించింది.

**భూ కక్ష్యలోకి చైనా అంతుచిక్కని వస్తువు**

దాదాపు 372 మైళ్ల ఎత్తులో చైనా అంతరిక్ష విమానం ద్వారా ఒక రహస్యమైన వస్తువును భూమి కక్ష్యలోకి విడుదల చేసింది. దీన్ని హార్వర్డ్ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త ఒకరు గుర్తించారు. దీన్ని అమెరికా స్పేస్ ఫోర్స్ పర్యవేక్షిస్తున్నది. అయితే, ఎందుకు ఈ రహస్య వస్తువును భూ కక్ష్యలోకి విడుదల చేసిందన్నది తెలియరాలేదు.

## 'తైవాన్ స్వాతంత్ర్యం' అంటే యుద్ధమే!

### చైనా మిలిటరీ హెచ్చరిక

బీజింగ్: 'తైవాన్ స్వాతంత్ర్యం' అంటే యుద్ధమేనని చైనా మిలిటరీ హెచ్చరికలు చేసింది. తైవాన్‌లో వేర్పాటువాద కార్యకలాపాలకు మద్దతిచ్చే విదేశీ శక్తుల జోక్యాన్ని నిలువరించేందుకు కఠిన చర్యలు తీసుకొంటామని స్పష్టం చేసింది. చైనా సైన్యం అధికార ప్రతినిధి వు కియాన్ గురువారం మీడియాతో మాట్లాడుతూ చైనా పునరేకీకరణ అనేది చరిత్రలో తిరుగులేనిదని పేర్కొన్నారు. ఈనెల 20న తైవాన్ అధ్యక్షుడిగా లై చింగ్ తే ప్రమాణ స్వీకారం సందర్భంగా ఆయన చేసిన స్వాతంత్ర్య అనుకూల ప్రసంగంపై అడిగిన ప్రశ్నకు ఈ మేరకు స్పందించారు.

## ఆ రోజు మీ కళ్లెక్కడున్నాయ్?

### హమాస్ దాడిని ఉటంకిస్తూ విమర్శకులకు ఇజ్రాయెల్ కౌంటర్

జెరూసలెం, మే 30: గాజాలోని ఒక శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్ చేసిన దాడిని ఖండిస్తూ సామాజిక మాధ్యమాల్లో విస్తృ ప్రచారం చేస్తుండటంపై ఇజ్రాయెల్ స్పందించింది. ఇప్పుడు తాము రఫాపై చేస్తున్న దాడి గురించి మాట్లాడుతున్న వారు గత ఏడాది అక్టోబర్ 7న తమపై హమాస్ జరిపిన దాడి గురించి ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీసింది. 'వేర్ వర్ యువర్ ఐస్' క్యాప్షన్‌తో ఒక పసికందు ముందు సాయుధుడైన ఉగ్రవాదితో ఉన్న ఇమేజ్‌ను షేర్ చేసింది. మరోవైపు, గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం ఆపితే, బందీలు/ఖైదీల మార్పిడి సహా అన్నింటిపై అంగీకారానికి వస్తామని హమాస్ ప్రకటించింది.



జమ్ముకశ్మీర్‌లో ఘోర ప్రమాదం సంభవించింది. బస్సు అదుపుతప్పి లోయలో పడటంతో 22 మంది దుర్మరణం చెందారు. 57 మంది గాయపడ్డారు. 75 మంది భక్తులతో యూపీ నుంచి జమ్ములోని శివ్ ఖోరీ దేవాలయానికి వెళ్తుండగా తుంగి-మోర్హ్ వద్ద ఈ ప్రమాదం జరిగింది.

## తండ్రిని, తమ్ముడిని చంపి.. శరీరాలను ముక్కలుగా నరికి

- ఫ్రిజ్‌లో దాచిన 15 ఏండ్ల బాలిక.. ప్రేమ కోసం ఘాతుకం
- రెండున్నర నెలల తర్వాత అరెస్ట్ చేసిన పోలీసులు

హరిద్వార్, మే 30: తన ప్రేమకు అడ్డుపడుతున్నారన్న కోపంతో పదో తరగతి చదువుతున్న 15 ఏండ్ల బాలిక తండ్రి, సోదరుడిని అత్యంత దారుణంగా హత్యచేసింది. అనంతరం వారి శరీరాలను ముక్కలు ముక్కలుగా నరికి వాటిని ఫ్రిజ్‌లో దాచిపెట్టింది. ఒళ్లు గగుర్పొడిచే ఈ ఘాతుకానికి పాల్పడి తప్పించుకు తిరుగుతున్న ఆ బాలికను రెండున్నర నెలల తర్వాత పోలీసులు హరిద్వార్‌లో అరెస్ట్ చేశారు. ఈ దారుణ ఘటన మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో చోటు చేసుకుంది. రైల్వేలో క్లర్క్‌గా పనిచేసే రాజ్‌కుమార్ విశ్వకర్మ కుమార్తె అయిన ఈ బాలిక ముకుల్ సింగ్ (19) అనే యువకుడితో ప్రేమలో పడి గత ఏడాది అతనితో వెళ్లిపోయింది. దీంతో అతడిని పోక్సో చట్టం కింద పోలీసులు అరెస్ట్ చేశారు. తమ ప్రేమ ఫలించాలంటే తన తండ్రిని అడ్డు తొలగించుకోవడం ఒక్కటే మార్గమని ఆ బాలిక నిర్ణయించుకుంది. దీంతో ఇద్దరూ హత్యకు పథకం వేశారు. అనుకున్నట్టుగానే బ్లేడ్‌తో కోసి రాజ్‌కుమార్‌ను హత్య చేశారు. అదే సమయంలో నిద్రలోంచి లేచిన తొమ్మిదేళ్ల బాలిక సోదరుడిని సుత్తితో మోదీ హతమార్చారు. తర్వాత మృతదేహాలను ముక్కలుముక్కలుగా నరికి వాటిని ఫ్రిజ్‌లో ఉంచి పరారయ్యారు. కాగా, బాలిక హరిద్వార్‌లో పట్టుబడగా, ముకుల్ మాత్రం ఇంకా పరారీలోనే ఉన్నాడు.











